12వ పాఠం డిశంబరు 11-17

# నూతన నిబంధనలో ద్వితియోపదేశకాండము

సబ్బాతు మధ్యాహ్నము : డిశంబరు 11

ఈ వారమునకు చదువ వలసిన వచనములు : మత్తయి 4:1-11; ద్వితి 8:3; అపో.కా.10:34; గలతి 3:1-14; అపో.కా.7:37; హెబ్రి 10:28-31.

**కంఠతవచనం :** **"అందుకాయన - మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదు గాని దేవునినోట నుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును అని వ్రాయబడి యున్నదనెను" (మత్తయి 4:4).**

నూతన నిబంధన గ్రంథము పాతనిబంధన గ్రంథముతో నిండియున్నది. దేవుని వాక్యమునకున్న అధికారమునకు మూలాధారముగా పాతనిబంధన గ్రంథకర్తలు దైవావేశముతో వ్రాసిన విషయాలను నూతన నిబంధన గ్రంథకర్తలు ఉదహరించారు. యేసు తానే స్వయముగా ఇట్లు చెప్పాడు అని వ్రాయబడియున్నది (మత్తయి 4:4). అనగా పాతనిబంధనలో ఆ విధముగా వ్రాయబడియున్నదనియు, ఆ లేఖనములు నెరవేరలసియుందని ఆయన ఉద్దేశమై ఉన్నది. "లేఖనములు నెరవేరునట్లు (మార్కు 14:49) అని చెప్పెను. ఎమ్మాయుకి వెళ్ళే మార్గములో యేసు యొక్క శిష్యులలో ఇద్దరిని కలుసుకొని, ఆయన ఎవరైయున్నారో అని వారికి చూపించుటకు ఒక అద్భుత కార్యమును చేయకుండా వారితో ఈ విధముగా చెప్పియున్నాడు.

"మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను" (లూకా 24:27).

పాతనిబంధన వాక్యాలను నేరుగా ఉదహరించినా లేక సూచన ప్రాయముగా, లేక కొన్ని వృత్తాంతాలకు లేక కొన్ని ప్రవచనాలకు సంబంధించిన కొన్ని వాక్యాలు చెప్పినా, నూతన నిబంధన రచయితలు చెప్పే విషయాన్ని సమర్థించుకొనుటకు లేక రుజువు పర్చుటకు నిరంతరము పాతనిబంధనలోని వాక్యాలను సందర్భానుసారముగా ఎంచుకొని నూతననిబంధనలో వాటిని వ్రాసేవారు. ఆవిధముగా వారెక్కువగా ద్వితియోపదేశకాండమును ఎంచుకునేవారు. (దానితో పాటు కీర్తనలు, యెషయా గ్రంథములను కూడా ఎంచుకొనేవారు) మత్తయి, మార్కు, లూకా, యోహాను, అపో.కార్యము, రోమా, గలతీ, 1, 2 కొరింథీ, హెబ్రీయులకు వ్రాసిన పుస్తకము, పత్రికలు మరియు ప్రకటన ఇవన్నియు ద్వితియోపదేశకాండము నుండి అనేక

ఉదాహరణలను ఎంచుకోవడం జరిగింది.

ఈ వారం మనము కొన్ని సంఘటనలను పరిశీలించి వాటి నుండి నేటి దినమునకు అవసరమైన సత్యమును వెదకబోవుచున్నాము.

– డిశంబరు 18, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు సిద్దపడుడి.

**ఆదివారం** **డిశంబరు 12**

## "అని వ్రాయబడియున్నది"

**మత్తయి 4:1-11 చదువుడి. అరణ్యములో సాతానుడు యేసును శోధించినప్పుడు ఆయన ఆ శోధనలను త్రిప్పికొట్టడానికి ఏవిధంగా స్పందించాడు? ఆయన ఇచ్చిన జవాబులో మనకు వచ్చుచున్న ప్రధానమైన గుణపాఠమేమిటి?**

యేసు సాతానుతో వాదించలేదు లేక చర్చలకు దిగలేదు. ఆయన కేవలం లేఖనముల నుండి దేవుని వాక్యమును ఉదహరించాడు. ఎందువలనంటే వాక్యమునకున్న శక్తి అటువంటిది. "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను, విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12). ఆయన ఎదుర్కొనిన ఆ శోధనలకు ప్రతిసారి ద్వితియోపదేశకాండము నుండే జవాబును ఎన్నుకున్నాడు. ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే ఇశ్రాయేలు ప్రజలు అరణ్యములోనే శోధింపబడినారు. అదే రీతిగా యేసు కూడా అరణ్యములోనికి కొనిపోబడుట ద్వారా అక్కడ శోధింపబడెను.

మొదటి శోధనకు జవాబుగ యేసు ద్వితి 8:3ను ఎంచుకున్నాడు. ఇశ్రాయేలు ప్రజలు వారు అరణ్యములో సంచరించిన కాలమంతటిలో దేవుడు వారికి 'మన్నా' ను ఆహారముగా అనుగ్రహించెను. అదంతయు ఇశ్రాయేలు ప్రజలను సంస్కారవంతులనుగా తీర్చిదిద్ది వారికి ఆధ్యాత్మిక పాఠములను బోధించాలనే ఉద్దేశముతో దేవుడు వారిని తర్ఫీదు చేస్తున్నాడు. ఆయన నేర్పిన పాఠాలలో ఆహారమును గూర్చి కూడా ఉన్నది. "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదు గాని దేవునినోట నుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును". దేవుడు మీకు భౌతికమైన ఆహారమును తినిపించినను, ఆయన ఆధ్యాత్మిక పోషణను అనుగ్రహించును. రెండవది లేకుండా కేవలం మొదటి భాగముతోనే సరిపెట్టుకోలేము.

యేసు రొట్టెను ఒక సాదృశ్యముగా తీసుకొని, ద్వితియోపదేశకాండములోనికి నడిపించి, సాతానును గద్దించుటకు ఆ అవకాశమును ఉపయోగించుకొనెను.

రెండవ శోధనలో యేసు ద్వితి 6:16నకు వెళ్ళి ఇశ్రాయేలు ప్రజలు మస్సాలో చేసిన తిరుగుబాటును గూర్చి మోషే చెప్పిన విషయాన్ని చూస్తున్నాము (నిర్గమ 17:1-7 చూడుడి) మీరు 'మస్సా'లో దేవునిని శోధించినట్లు మీ దేవుడైన యెహోవాను మీరు శోధించకూడదు అని చెప్పెను. శోధించుట అనే మాటకు ప్రయత్నించు లేక పరీక్షించు అని అర్థమున్నది. దేవుడు అప్పటికే వారి అవసరములను తీర్చుటకు ఎల్లప్పుడు సిద్ధముగానే ఉన్నాడు. అయినప్పటికి శ్రమ కలిగినపుడు దేవుడైన యెహోవా మధ్యన ఉన్నాడా? లేదా? అని ఎంతో దుఃఖించారు (నిర్గమ 17:7) సాతాను గద్దించుట వరకు యేసు ఈ వృత్తాంతము నుండి ఉదహరించాడు. మూడవ శోధనలో ఈసారి క్రీస్తును ఒంగి అతనిని (సాతానును) పూజింపమని సాతాను అడిగాడు. దీన్నిబట్టి సాతానుదేమైయున్నాడో, ఏమి కావాలో అనే విషయము బహిరంగముగా అర్థమవుతుంది. యేసు సాతానుతో వాదానికి దిగకుండా ద్వితి -లోని దేవుని వాక్యముతో జవాబిచ్చాడు. దేవుని నుండి దూరమై ఇతర దేవతలను ఆరాధిస్తే ఏమి జరుగునో తన ప్రజలకు హెచ్చరించెను. "నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించాలి" (ద్వితి 6:13).

**యేసువలె మనము సాతాను శోధనలను ఎదిరించుటకు దేవుని వాక్యము చదువుట ద్వారా యేసు స్వభావము ప్రతిబింబించులాగున శక్తిని పొందుటకు ఎట్లు నేర్చుకొగలము?**

**సోమవారం** **డిశంబరు 13**

## ముఖములను పైకెత్తుకునేలా

ద్వితియోపదేశకాండము 10లో మోషే మరొకసారి ఇశ్రాయేలు యొక్క చరిత్రలోని కొన్ని వృత్తాంతములను పరిగణలోనికి తీసుకొని వారి విశ్వాసమునకు సంబంధించి హెచ్చరికలను చేసాడు. వారికి బుద్ధి చెప్పే క్రమములో ఒక విషయాన్ని ఆయన చెప్పాడు.

**ద్వితి 10:17-19 చదువుడి. ఇక్కడ ఇశ్రాయేలీయులకివ్వబడిన ప్రధానమైన వర్తమానము ఏమిటి? మరియు ఎందుచేత ఈ వర్తమానము నేడు దేవుని యొక్క సంఘమునకు కూడా చెందుతుంది?**

"నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు" లేక "పక్షపాతము చూపనివాడు" అనే ఈ పద సముదాయము ఒక హెబ్రీ అలంకారమునుండి తర్జుమా చేయబడినది. అనగా దీనికి మాటకు మాట అర్థమును చూచినపుడు దేవుడు "ముఖములను పైకెత్తుకునేలా చేసేవాడు కాదు అనే భావము కలుగుతుంది. ఇక్కడ ఒక న్యాయపరమైన నేపథ్యము ఉన్నట్లు నమ్మకము

కలుగుతుంది. ఒక న్యాయాధిపతి లేక రాజు ఒక వ్యాజ్యమును పరిశీలించేటప్పుడు అతడు ఆ వ్యాజ్యములో చేర్చబడిన మనుష్యుల యొక్క ముఖములను చూచి, ఆ వ్యక్తి లేక వ్యక్తుల యొక్క అంతస్తు లేక గౌరవము లేక హోదా చూచి ఒక తీర్పును ప్రకటిస్తారు. అయితే ద్వితియోపదేశకాండములో పేర్కొనబడినట్లు యెహోవా దేవుడు జనుల గొప్పతనమును, అధికారమును లేక హోదాను చూడడు. ఎవరికెటువంటి హోదా ఉన్నను, ప్రతి ఒక్కరి యెడల ఆయన న్యాయముగా వ్యవహరిస్తాడు. ఈ పరమ సత్యము యేసు యొక్క జీవితములో బయలుపర్చబడినది. సమాజములో హీనముగా చూపబడిన వారిని సహితము ఎంతో ఆదరణతో ఓదార్చేవాడు.

**అపొ.కా. 10:34; రోమా 2:11; గలతి 2:6; ఎఫెసి 6:9; కొలస్సి 3:25 మరియు 1 పేతురు 1:17 చదువుడి. ఈ వాక్యాలు ద్వితియోపదేశకాండములోని 10:17ను ఏవిధముగా ఉపయోగించుకొనెను?**

పరిస్థితులు ఎంత వేర్వేరుగా ఉన్నప్పటికి పైన పేర్కొనబడిన ప్రతి వాక్యము ద్వితియోపదేశకాండములో చెప్పబడినట్లు దేవుడు "నరుల ముఖమును లక్ష్యము పెట్టనివాడు" అనే భావమును ధృవీకరించినవి. (ఎఫెసీలో పౌలు మాట్లాడుతూ యజమానులు వారి బానిసలయెడల పక్షపాతములేకుండా వ్యవహరించాలి. రోమాలో కూడా ఆయన మాట్లాడుతూ రక్షణను అనుగ్రహించే విషయములోను మరియు శిక్షను విధించే విషయములోను దేవునికి యూదుడని లేక అన్యజనులని తేడా లేదు లేక పక్షపాతము లేదని చెప్పెను). దేవుళ్ళకు దేవుడు మరియు ప్రభువులకు ప్రభువు. ఘనుడైన దేవుడు, బలవంతుడైన దేవుడు మరియు భయమును కలిగించే దేవుడు పక్షపాత ధోరణితో ప్రవర్తించడు.

ముఖ్యముగా రోమాలో పౌలు చెప్పిన మాటలలో సువార్త బయలుపర్చబడినది. హోదా ప్రకారము మనము వేరువేరుగా ఉన్నప్పటికి దేవుని దృష్టిలో మనమందరము సమానులమే. మన మందరము పతనమైపోయిన మనుష్యులము. మనందరికి దేవుని యొక్క రక్షణ కృప అవసరమైయున్నవారమే. ఇక్కడ మనందరికి రక్షణ ఉద్దేశించబడినది. అదొక శుభవార్తయైయున్నది.

**కొన్నిసార్లు అనుకోకుండా కూడా నరుల ముఖములను లక్ష్యపెడుతూ ఉంటారు? అట్టి ఆలోచన విధానము పాపమని సిలువ మనకు ఏవిధముగా చూపిస్తుంది?**

**మంగళవారం** **డిశంబరు 14**

## మ్రానుమీద శాపగ్రస్తుడాయెను

**గలతీ 3:1-14 చదువుడి. మనకు నేడు వర్తించే ఏ విషయాన్ని గూర్చి పౌలు**

**అక్కడ చెప్పుచున్నాడు? ఆయన చెప్పదలచిన విషయము కొరకు ద్వితి 27:26; ద్వితి 21:22, 23ను ఏవిధముగా వాడుకున్నాడు?**

ధర్మశాస్త్రమును (పది ఆజ్ఞలను) గైకొనవసరములేదని సమర్ధించుకొనుటకు కొంతమంది క్రైస్తవులు ఈ పత్రికను సామాన్యముగా వాడుకుంటున్నారు. ఆ వాదనలో ముఖ్యముగా 4వ ఆజ్ఞను గైకొనవసరములేదని చూపిస్తారు. మిగిలిన 9 ఆజ్ఞల విషయమై పెద్దగా స్పందించరు. ఆ విధముగా చేయుట ఎంత వరకు న్యాయసమ్మతమో అనే విషయాన్ని పౌలు ఇక్కడ చర్చించుచున్నాడు.

అవును. పౌలు ధర్మశాస్త్రమునకు (పదియాజ్ఞలకు) వ్యతిరేకముగా మాటలాడుట లేదు. సబ్బాతు ఆజ్ఞను మీరటము న్యాయపరముగా అంగీకారమే అని ఈ వాక్యాలలో కనిపించుట లేదు. దీనికి సంబంధించి చిక్కుతీయుటకు రహస్యము గలతీ 3:10లో ఉంది. పౌలు ఈ విధముగా వ్రాస్తున్నాడు. "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు" అని వ్రాస్తూ ద్వితి 27:26ను దృష్టాంతముగా చెప్పుచున్నాడు. ఇక్కడున్నది ధర్మశాస్త్రమునకు విధేయత చూపించుట గురించి కాదు, కాని ధర్మశాస్త్రము మీద ఆధారపడటమనునది అంశమైయున్నది. అది పతనమైన మనలాంటి మనుష్యులకు అసాధ్యమైన విషయము.

ధర్మశాస్త్ర క్రియలను బట్టి మనము రక్షింపబడుట లేదు గాని మన పక్షమున మరణించిన క్రీస్తు పైన మనముంచిన విశ్వాసము ద్వారా రక్షణ అనుగ్రహించబడుచున్నదని పౌలు స్పష్టముగా చెప్పాడు. ఇక్కడ సిలువపై మనకొరకు క్రీస్తు చేసిన కార్యమును గూర్చి పౌలు నొక్కి చెప్పాడు. ఇదే విషయాన్ని బలపర్చుటకు ఈసారి ద్వితి 21:23 ఉదహరించాడు. యేసు చెప్పినట్లుగానే పౌలు కూడా "ఈ విధముగా వ్రాయబడినది" అని చెప్పి పాతనిబంధనకున్న అధికారమును ప్రస్తావిస్తూ మరణ శిక్ష అమలు చేయబడిన ఒక నేరస్తుని యొక్క దేహమును ఇతరులకు ఒక గుణపాఠముగా ఉండుటకు ఒక మ్రాను మీద వ్రేలాడదీయబడును అనే విషయాన్ని పాతనిబంధన గ్రంథము నుండి ఉదహరించాడు.

పౌలు ఆ విషయాన్ని ఒక చిహ్నముగా తీసుకొని మనకు బదులుగా క్రీస్తు మరణించెననియు, ఆయన మన కొరకు శాపమాయెననియు అందుచేత ధర్మశాస్త్రమునకు విధేయత చూపకపోవడము వలన లభించే మరణమును మన పక్షమున ఆయన పొందెననియు, క్రీస్తునందు విశ్వాసముంచిన రక్షణ వాగ్దానమును పొందుదురని చెప్పెను (గలతీ 3:14).

“క్రీస్తు తప్ప మరెవ్వరూ పతనమైన మానవుడిని ధర్మశాస్త్రము యొక్క శాపమునుండి విమోచించలేరు. పరలోకములో తిరిగి సామరస్యమును నెలకొల్పలేరు. పాపము యొక్క దోషమును, అవమానమును క్రీస్తు తన మీద వేసుకొనెను” –ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 63

**మనము చేసిన పాపాలకు న్యాయమైన శిక్షను పొందవలసి వస్తే ఏవిధముగా ఎదుర్కొనగలమో ఆలోచించండి. క్రీస్తు మన శిక్షను భరించెను గనుక ఆ భయమక్కరలేదు. ఆయన వాగ్దానమునకు మన స్పందన ఎట్లుండాలి?**

బుధవారం **డిశంబరు 15**

## నీతో సాటియైన ఒక ప్రవక్త

ఇశ్రాయేలు ప్రజలు వారి చుట్టు ప్రక్కలున్న దేశ ప్రజలు అనుసరించు ఆచారములను వీరు అనుసరించకూడదని దేవుడైన యెహోవా హెచ్చరిస్తూనే ఉన్నాడు. దానికి విరుద్ధముగా వారు ఆ దేశాలకు సాక్షులుగా ఉండాలని ఆయన కోరుకున్నాడు (ద్వితి 4:6–8) ద్వితి 18:9–14లో యెహోవాకు హేయములైన వాటిని చేయు వారిని గూర్చి మోషే హెచ్చరించుచున్నాడు. ఆ సందర్భములో ఆయన మాట్లాడుతూ “నీ దేవుడైన యెహోవా యొద్ద యథార్థపరుడవై యుండవలెనని చెప్పెను” (ద్వితి 18:19).

**ద్వితి 18:15–19 చదువుడి. ఇక్కడ మోషే వారికేమి చెప్పుచున్నాడు. తరువాత దానిని అపో.కా. 3:22; 7:37తో పోల్చిచూడుము. పేతురు మరియు స్తెఫను ద్వితి 18:18ని ఏవిధముగా ఉపయోగించుకున్నారు?**

సీనాయి యొద్ద చేసుకొనిన నిబంధనకు సంబంధించి మోషే ఇశ్రాయేలు జనాంగముతో మాట్లాడుతూ బయలుపర్చబడిన దేవుని ధర్మశాస్త్రము యెడల ఏ విధముగా ఉండాలో వారికి బోధించుచున్నాడు (నిర్గమ 20:18–21). దేవునికిని వారికిని మధ్య ఒక మధ్యవర్తిగా వారి పక్షమున సంరక్షడుగా మోషే వారికి కావాలని కోరారు. దానికి మోషే రెండుసార్లు వాగ్దానము చేయుచు (ద్వితి 18:15, 18), దేవుడైన యెహోవా మోషే వంటి ఒక ప్రవక్తను నియమిస్తాడనియు, ఆయన మోషేవలె ప్రజలకును దేవునికి మధ్య మధ్యవర్తిగా ఉంటాడని చెప్పెను.

అనేక శతాబ్దముల తరువాత ఈ పైవాక్యమును ఉదహరిస్తూ పేతురు మరియు స్తెఫను ఇరువురు కూడా యేసును గూర్చి మాట్లాడియున్నారు. పేతురు ఉద్దేశములో పరిశుద్ధ ప్రవక్తలు నోట పలికిన మాటలు (అపో.కా. 3:21) యేసునందు నెరవేరియున్నవనియు,

మతనాయకులు ఆయన మాట విని విధేయత చూపించాలని ప్రకటించెను. ఆ విషయము యూదులకు తెలుసు కావున పేతురు ఆ వాక్యమును ఉదహరించి నేరుగా దానిని యేసునకు వర్తింపచేసెను. 'యూదులు ఆయనకు చేసిన దానిని బట్టి వారు మారుమనస్సు పొందవలసియున్నదనే భావమును పేతురు ఇక్కడ నొక్కి చెప్పుచున్నాడు' (అపో.కా.3:19).

అపో.కా. 7:37లో స్తెఫను వేరొక సందర్భములో క్రీస్తును గూర్చి ప్రకటిస్తూ పాతనిబంధనలో మోషే చెప్పిన విషయాన్ని ఉదహరిస్తూ ప్రసిద్దికెక్కిన ఆ వాగ్దానము యేసునకు చూపించుచున్నదని ఒప్పుకొనెను. మోషే నిర్వహించిన పాత్ర చరిత్రలో నిలిచియున్నదనియు, ఆయన యూదులకు నాయకుడుగా వారిని నడిపించిన తీరు యేసును ముందుగానే చూపిస్తుంది. ఆవిధముగా ప్రవచనము నెరవేరియుందని పేతురు మరియు స్తెఫను ప్రజలకు తెలియజేయుచున్నారు. మోషేకు మరియు దేవునికి వ్యతిరేకముగా "దూషణ మాటలు పలుకుచున్నాడని" (అపో.కా.6:11) స్తెఫను మీద నేరారోపణ చేయగా అందుకు స్తెఫను, మోషే ద్వారా దేవుడు చేసిన వాగ్దానము నేరుగా నెరవేరినదని యేసును మెస్సీయ్యాగా ప్రకటించెను.

**ఈ వాక్యములు బైబిలంతటికి ఏవిధముగా యేసు కేంద్ర బిందువైయున్నాడని చూపిస్తుంది? మన అవగాహన అంతయు ఎందువలన క్రీస్తు కేంద్రమైయుండాలి?**

గురువారం **డిశంబరు 16**

## భయమును కలిగించే ఒక విషయము

యేసును నమ్మిన యూదయ విశ్వాసులకు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక ద్వారా ఒక లోతైన, సుదీర్ఘమైన బోధ చేయబడెను. ప్రోత్సాహకరమైన ఆ బోధ ద్వారా 'ప్రభువునకు విశ్వాసులుగా నిలిచియుండుడి' అనే వర్తమానము వారికి అందించబడెను.

ఈ విశ్వాసమనునది దేవునియెడల మనకున్న ప్రేమ యొక్క మూలముల నుండి రావలసియున్నది. ఆ విషయము బాగుగా అర్థమగుటకు సిలువ యొద్ద క్రీస్తు చూపిన శక్తివంతమైన ప్రేమ, మంచితనము, ఆయన ఏమైయున్నాడు మరియు ఆయన స్వభావమును గూర్చి ముందుగా తెలుసుకొనాలి. మానవుడు పాపములో పడిపోవుట వలన సంభవించిన భయంకర ఫలితాలను గూర్చి జ్ఞాపకము చేసుకొనడం ఎంతైనా అవసరముంది. దాని ప్రకారము మన పాపములనిమిత్తమై మనము చెల్లించవలసిన పరిహారమును యేసు సిలువ మీద చేసిన కార్యము ద్వారా చెల్లించెనని అంగీకరించకపోయినచో ఆ పరిహారమును మనము చెల్లించవలసియున్నది. అనగా దాని అర్థము "ఏడ్పును, పండ్లుకొరుకుటయు ఉండును"

(మత్తయి 22:13) మరియు దానివెంబడి నిత్యనాశనము సంభవించును.

**హెబ్రీ 10:28-31 చదువుడి. పౌలు ఏమి చెప్పుచున్నాడు? అది మనకు కూడా ఏవిధముగా వర్తిస్తుంది?**

యూదయ విశ్వాసులు దేవునికి విధేయులుగా నిలిచియుండుడి అని బోధించుటకు పౌలు ద్వితియోపదేశకాండము 17:6ను ఉదహరిస్తూ ఎవరైనా మరణ శిక్షకు పాత్రుడైన యెడల ఆ వ్యక్తికి వ్యతిరేకముగా ఇద్దరు సాక్షులు సాక్ష్యము చెప్పవలసియున్నదనే విషయాన్ని గుర్తు చేశాడు.

ఇక్కడ పౌలు మాట్లాడుతూ పాత ఒడంబడిక (నిబంధన) ప్రకారము అవిశ్వాసము వలన ఎవరికైనా మరణ శిక్ష పడినచో "మరి దేవునికుమారుని పాదములతో త్రొక్కి, తాను పరిశుద్ధ పరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి, కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకుతోచును?" (హెబ్రీ 10:29). ఇంకొక విధముగా చెప్పాలంటే పాతనిబంధన కాలము నాటి ప్రజలకన్నా మీకు ఎక్కువ వెలుగు, ఎక్కువ సత్యము అనుగ్రహింపబడి, మీ పాపముల నిమిత్తము దేవుని కుమారుడు సిలువ వేయబడెను అని తెలిసియుండియు, మీరు పాపములో పడిపోయిన యెడల వారికంటే మీరు పొందే శిక్ష అధికముగాఉండునని చెప్పెను.

పౌలు చేసిన ఈ వాదమునకు బలమును చేకూర్చుటకు వెంటనే ద్వితి 32:35కి వెళ్ళి క్రీస్తు ద్వారా వారికి ఏమి అనుగ్రహించబడినదో వివరించి దేవుడు తన ప్రజల యొక్క అవిశ్వాసమును బట్టి, మతభ్రష్టత్వమును బట్టి వారికి తీర్పుతీర్చుననియు, పగ తీసుకొనుట నావంతు అని ఆయన చెప్పినట్లు వారికి గుర్తు చేస్తూ, నూతన నిబంధనలోని యూదులకున్నంత వెలుగు వారి పూర్వీకులకు లేకపోయినను, వారికి తీర్పు తీర్చెననియు, సిలువ ద్వారా దేవుని యొక్క ప్రేమను ఎక్కువ బయలుపర్చుటచేత మీకును తీర్పు ఉంటుందని చెప్పెను. దీని ద్వారా మీరు హెచ్చరింపబడుచున్నారని పౌలు చెప్పెను.

**దేవుడు తన ప్రజలకు తీర్పుతీర్చును (ద్వితి 32:36) ఆ తీర్పులో మనకున్న ఏకైక నిరీక్షణ ఏమిటి? (రోమా 8:1) చూడుడి.**

**శుక్రవారం** **డిశంబరు 17**

## అదనపు అధ్యయనము

పాతనిబంధన గ్రంథము తనను తానే ఉదహరించుకొనినట్లు (ఉదా: మోషే వ్రాసిన

5 పుస్తకాల నుండి ఉదహరించి కొంతమంది ప్రవక్తలు వారి రచనలు చేశారు) నూతన నిబంధన గ్రంథములో నేరుగా పాతనిబంధన నుండి ఉదహరించిన విషయాలతో నిండియున్నది. కీర్తనలు, యెషయా, ద్వితియోపదేశకాండము వంటి గ్రంథాలనుండి ఎక్కువగా ఉదహరించినట్లు చూడగలము. కొన్నిసార్లు నూతన నిబంధన గ్రంథకర్తలు గ్రీకు భాషలోని పాతనిబంధన గ్రంథమైన "సెప్ట్యుజింట్" నుండి కూడా ఉదహరించియున్నారు. బైబిలులోని మొదటి 5 పుస్తకాలను "టోరాహ్" లేక "పెన్టచ్యూక్" అని పిలుస్తున్నారు. వాటిని క్రీ॥పూ॥ 3వ శతాబ్దములో తర్జుమా చేయబడినవి. తరువాత మిగిలిన పాతనిబంధనంతయు క్రీ॥పూ॥ 2వ శతాబ్దములో తర్జుమా చేయబడినవి.

పాతనిబంధన గ్రంథమునుండి క్రొత్త నిబంధన గ్రంథకర్తలు ఆత్మపూర్ణులైన వారు ఉదహరించిన విషయాల ద్వారా ఎంతో నేర్చుకొనవచ్చును. నేటి గ్రంథకర్తల వలె నూతన నిబంధన గ్రంథకర్తలు పాతనిబంధన యొక్క ప్రామాణికత్వమును (నిజమును) గాని అధికారమునుగాని, దాని చరిత్రను గాని ఎన్నడూ ప్రశ్నించలేదు. ఆదామవ్వల ఉనికి, మానవుడు పాపములో పడిపోవుట, జలప్రళయము, అబ్రహాము పిలువబడుట వంటి ఎన్నో విషయాలను ఎట్టి అనుమానములు వ్యక్తపర్చకుండానే అంగీకరించారు. బైబిలులో ఉన్న పాండిత్యమును గూర్చి ప్రశ్నించేవారు సంశయ వాదమును నమ్మేటవంటివారు. అటువంటి వారికి సెవెంతు డే ఎడ్వంటిస్టు సభ్యుల హృదయాలలోను, మనసులలోను స్థానముండనవసరము లేదు.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. సెవెంతు-డె ఎడ్వంటిస్టు సభ్యులముగా మనకివ్వబడిన వెలుగును బట్టి మన బాధ్యత విషయమై అది ఏమి బోధిస్తుంది?
2. ద్వితీ 18:9-14 ను మరొకసారి చదవండి. "దేవునికి హేయమైన విషయాలను, నవీన ప్రపంచము ఏవిధముగా చూపిస్తున్నది?

❖❖❖